నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, గురువారం 1 ఆగస్టు 2024 | KARIMNAGAR

# ఉమ్మడి జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ల ట్రాన్స్‌ఫర్స్

కరీంనగర్ కలెక్టరేట్/ వేములవాడ, జూలై 31: ఉమ్మడి జిల్లాలో గ్రేడ్ వన్, గ్రేడ్-2 కేటగిరీలకు చెందిన సబ్ రిజిస్ట్రార్లను ప్రభుత్వం బుధవారం ట్రాన్స్‌ఫర్ చేసింది. వేములవాడ సబ్ రిజిస్ట్రార్ సురేంద్రబాబు ఎల్లారెడ్డికి బదిలీ కాగా, ఆయన స్థానంలో మరెవరికీ బాధ్యతలు అప్పగించగలేదు. ఇక మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ జ్యోతి ఐజీ కార్యాలయానికి, కిషన్ నాయక్ జగిత్యాల నుంచి భీమదేవరపల్లికి, మసూద్ అలీ హుజూరాబాద్ నుంచి ఆదిలాబాద్, అప్పారావు సుల్తానాబాద్ నుంచి ఆసిఫాబాద్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో ఎవరిని నియమించలేదు. ఇక అశోక్ ఆసిఫాబాద్ నుంచి కోరుట్లకు, ప్రియాంక మంథని నుంచి మంచిర్యాల, ఉమాదేవి డీఐజీ కార్యాలయం సూపరింటెండెంట్ కరీంనగర్‌కు, మనోహర్ కరీంనగర్ నుంచి చేర్యాల, పద్మ గంగాధర్ నుంచి ఐజీ కార్యాలయం, పార్థసారథి సిరిసిల్ల నుంచి డీఐజీ కార్యాలయం కరీంనగర్, ఇంతియాజొద్దీన్ హుస్నాబాద్ నుంచి హుజూరాబాద్‌కు, ఇక్బాల్ అహ్మద్ మల్యాల నుంచి భీమ్గల్‌కు బదిలీ అయ్యారు. అఫ్జల్‌నూర్‌ఖాన్ ఎల్లారెడ్డి నుంచి గంగాధరకు, హుస్నాబాద్‌కు అబ్దుల్ జబ్బర్‌లను, మెట్‌పల్లికి ఆసీఫ్‌వొద్దీన్‌ను బదిలీ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే పెద్దపల్లిలో ఎస్సార్ పోస్ట్ ఖాళీగా ఉంది. వీరంతా ఉత్తర్వులతో బదిలీ అయిన స్థానాల్లో నేడు విధుల్లో చేరాల్సి ఉంటుంది.

# గుంతలు ఇలా.. వెళ్లేదెలా..?

అధ్వానంగా గోపాల్‌రావుపేట- బూర్గుపల్లి రోడ్డు



రామడుగు మండలంతోపాటు చొప్పదండి, గంగాధర, పెగడపల్లి మండలాల్లోని సుమారు 40 గ్రామాలకు వాణిజ్య, వ్యాపార కేంద్రంగా విలసిల్లుతున్నది గోపాల్‌రావుపేట. ఈ గ్రామానికి నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుండగా, గోపాల్‌రావుపేట నుంచి బూర్గుపల్లి వెళ్లే ప్రధాన రోడ్డు కిలోమీటర్ మేర అధ్వాన్నంగా మారింది. చినుకు పడితే చాలు బురదమయమవుతున్నది. దానికి తోడు పెద్ద పెద్ద గుంతలతో ప్రయాణం ప్రమాదకరంగా మారుతున్నది. ఈ దారిపై వెళ్లాలంటే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అప్పుడప్పుడు జారి కింద పడిపోతున్నారు. రహదారితోపాటు దారికి ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. బుధవారం నిరసన కూడా తెలిపారు.

- రామడుగు, జూలై 31

*ఎల్లారెడ్డిపేట : రెండో విడత రుణమాఫీ జాబితాలో పేర్లు రాకపోడం, లిస్టులో పేరున్నా మాఫీ వివరాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. బుధవారం ఎల్లారెడ్డిపేట వ్యవసాయ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఏవో చాడ భూంరెడ్డి వద్దకు వచ్చి వివరాలు నమోదు చేయించుకున్నారు.*

# మళ్లీ అదే దగా..?



## రెండో విడుత రుణమాఫీలోనూ వేలాది మందికి నిరాశే

- సెకండ్ జాబితాలోనూ మెజార్టీ రైతుల పేర్లు గల్లంతు
- గ్రామాలకు గ్రామాలే మాయం
- కర్షకులకు తప్పని ఆందోళన
- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- ఉక్కిరిబిక్కిరవుతున్న అధికారులు



*రెండో విడుత రుణమాఫీలోనూ మళ్లీ అదే దగా ఎదురైంది. మొదటిసారి మాదిరిగానే ఈ సారి సైతం వేలాది మంది పేర్లు గల్లంతు కావడం గందరగోళానికి గురి చేస్తున్నది. అంతేకాదు, మెజార్టీ సహకార సంఘాల్లో యాభై శాతం మంది రైతులకు కూడా మాఫీ కాకపోవడం, పలు చోట్ల ఊళ్లకు ఊళ్లే మాయం కావడంపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది. అసలు మాఫీ ఎందుకు కాలేదో తెలియక వేలాది మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. వివరాలు తెలుసుకోవడం కోసం వ్యవసాయ అధికారుల వద్దకు పరుగులు పెడుతున్నారు. అయితే ఏ ఒక్క అధికారి నుంచి స్పష్టమైన సమాధానం రాక అయోమయానికి లోనవుతున్నారు. జాబితాలో మిస్ అయిన వారికి భవిష్యత్‌లో రుణమాఫీ వర్తింప చేస్తారా..? లేదా..? అన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నా నివృత్తి చేసేవారు లేక ఆగమవుతున్నారు.*

కరీంనగర్, జూలై 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడుత కింద ₹లక్ష వరకు రుణం మాఫీ చేస్తూ పది రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో 1,28,761 మంది రైతులకు ₹710.29 కోట్లు మాఫీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. తీరా రుణమాఫీ జాబితా విడుదలైన తర్వాత చూస్తే వేలాది మంది రైతుల పేర్లు గల్లంతుకాగా, కొన్ని గ్రామాల్లో అయితే ఒక్క రైతుకు కూడా మాఫీ కాలేదు. కొన్ని జాతీయ బ్యాంకుల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. ప్రధానంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని సహకార శాఖల్లో ₹లక్ష రుణమాఫీకి 58,577 మంది అర్హులు ఉండగా, ₹305.5 కోట్ల మాఫీ జరగాలి. కానీ, 32,240 మందికి ₹165.88 కోట్లు మాత్రమే జరిగింది. ఇంకా 26,337 మందికి ₹139.62 కోట్లకుపైగా మాఫీ కాలేదు. ఇప్పుడు అదే పరిస్థితి కనిపిస్తున్నది. రెండో విడుత కింద ఉమ్మడి జిల్లాల్లో 63,286 మందికి ₹580.71 కోట్లను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. మొదటిసారి వచ్చిన విమర్శల నేపథ్యంలో రెండో సారైనా పకడ్బందీగా రుణమాఫీ జరుగుతుందని రైతులు ఆశించినా, మళ్లీ అదే దగా జరిగింది. కేడీసీసీబీ పరిధిలోని సహకార శాఖల్లో ₹లక్షా యాభైవేల వరకు తీసుకున్న రైతుల్లో 49 శాతం మందికి ఈ సారి కూడా రుణమాఫీ జరగలేదు. ఇదే పరిస్థితి తిరిగి జాతీయ బ్యాంకుల్లోనూ కనిపిస్తున్నది. అలాగే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చూస్తే పలు గ్రామాల్లో మెజార్టీ రైతులకు మాఫీ కాలేదు. మొత్తంగా చూస్తే.. రెండో విడుత రుణ మాఫీ చేస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పిందే తప్పా మళ్లీ మొదటిసారి చేసిన తప్పులను దిద్దుకోలేదన్న విమర్శలున్నాయి.

### రైతుల్లో ఆందోళన.. అధికారుల్లో స్పష్టత కరువు

నిజానికి మొదటి విడుతతో పేర్లు రాని రైతులు అధికారులను ప్రశ్నిస్తే.. సాంకేతిక కారణాల వల్ల మాఫీ జరగలేదని, రెండు మూడు రోజుల్లో సవరించి అప్‌లోడ్ చేస్తున్నామని సర్దిచెప్పారు. అంతేకాదు, ₹లక్షా యాభై వేలు మాఫీ జరిగే సమయంలో ₹లక్ష జాబితాలో మిస్ అయిన రైతులకు కూడా తిరిగి మాఫీ జరుగుతుందని, అప్పటివరకు ఓపిక పట్టాలని, ప్రభుత్వం నుంచే తమకు సమాచారం వచ్చిందంటూ నచ్చ జెప్పారు. దీంతో రైతులు మాఫీ కాని విషయాన్ని వ్యవసాయ విస్తరణాధికారులకు వివరించి, వేచి చూశారు. తీరా ₹లక్షా యాభైవేల జాబితాలో చూస్తే.. గతంలో గల్లంతైన ఏ ఒక్క రైతు పేరు సదరు జాబితాలో లేదు. ఇదే సమయంలో ₹లక్షా యాభైవేల బాకీ రైతులందరికీ కూడా రుణమాఫీ జరగలేదు. దీంతో మొదటి, రెండో విడుత రుణమాఫీ జరగని రైతులందరూ వ్యవసాయ విస్తరణ అధికారుల వద్దకు పరుగులు పెడుతున్నారు. తమకెందుకు కాలేదో చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. గతంతో పోలిస్తే రైతుల తాకిడి బాగా పెరగ్గా.. అధికారులు ఆందోళన చెందుతున్నారు. సిస్టమ్ ఓపెన్‌చేసి.. మాఫీ జరగకపోవడానికి కారణం చెబుతున్నా.. రైతులనుంచి వస్తున్న ప్రశ్నలకు మాత్రం సూటిగా సమాధానం చెప్పలేకపోతున్నారు. పోని తిరిగి ఎప్పుడు మాఫీ అవుతుందన్న విషయంపై స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. బ్యాంకుల్లోనూ అదే అస్పష్టత నెలకొన్నది. రైతులు వెళ్లి అడిగితే ఎవరూ సమాధానం చెప్పడం లేదు. రుణమాఫీ జరగని విషయం తమకు తెలియదని, వ్యవసాయ విస్తరణ అదికారుల వద్దకు వెళ్లి తెలుసుకోవాలంటూ బ్యాంకర్లు చెబుతున్నారు. దీంతో రైతులు అటు బ్యాంకులు, ఇటు వ్యవసాయ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వ్యయప్రయాసాలకు లోనవుతూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### రుణమాఫీకి కొర్రీలెందుకు?

నేను రెండేండ్ల కిందట బ్యాంకులో రూ. 90వేల పంట రుణం తీసుకున్న. ఇప్పుడు మిత్తితో కలిపి లక్ష దాటింది. రెండో



విడుతల అప్పు మాఫీ అవుతుందని అనుకున్న. కానీ మొన్న సర్కారు విడుదల చేసిన లిస్ట్‌లో నా పేరులేదు. ఎందుకని అధికారులను అడిగితే నీకు రేషన్‌కార్డులేదని అంటున్నరు. సీఎం ఏమో కార్డులేకున్నా మాఫీ చేస్తమని చెబితే నిజమేనని నమ్మినం. ఇప్పుడు లేనిలేని కొర్రీలు పెట్టుడెందుకు? గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూల్స్ పెట్టకుండానే రైతులందరి అప్పులు మాఫీ జేసింది. కానీ కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ పేర ఆగం జేస్తున్నది.

**- యాదగిరి వెంకటేశ్వర్‌రావు, రామహనుమాన్‌నగర్ (తిమ్మాపూర్)**

### రెండు విడుతల్లో మాఫీ కాలే..

నాకు మూడెకరాల 15 గుంటల భూమి ఉంది. పూడూర్ సహకార సంఘంలో గతంలో క్రాప్‌లోన్ తీసుకున్న. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు నాకు



₹52 వేల లోన్ మాఫీ అయింది. మళ్లీ పూడూర్ ఇండియన్ బ్యాంక్‌ల ₹80 వేల లోన్ తీసుకున్న. మాఫీ అయితది అనుకున్న. కానీ, కాలే. కాంగ్రెస్ సర్కారు మొదట ఇచ్చిన లిస్టుల నా పేరు రాలేదు. రెండో విడుతల కూడా రాలేదు. బ్యాంక్‌కు వెళ్లి అడిగితే.. వ్యవసాయ శాఖ అధికారులు లిస్టు పంపలేదని, పంపిన తర్వాత వస్తుందని చెప్పిన్రు. వ్యవసాయ అధికారులను అడిగితే.. బ్యాంక్ వాళ్లకు లిస్టు పంపినం అన్నరు. తలోమాట చెబుతున్నరు. మాఫీ అయితదన్న నమ్మకం లేదు.

**- ఉట్కూరి సత్యనారాయణరెడ్డి, పూడూర్ (కొడిమ్యాల మండలం)**

### కొందరికే మాఫీ

పట్టా పాసు పుస్తకం పెట్టి క్రాప్‌లోన్ తీసుకున్న ప్రతి రైతుకు ₹2 లక్షల మాఫీ చేయాలి. కానీ, రేవంత్



సర్కారు అనేక కొర్రీలు పెట్టి కొందరికే చేస్తుంది. నేను పెద్దపల్లి ఇండియన్ బ్యాంకుల ₹1.20 లక్షల క్రాప్‌లోన్ తీసుకున్న. ఈ యేడాది ఫిబ్రవరిల వడ్డీ కట్టి రెన్యువల్ చేయించిన. కానీ, రెండో విడుత లిస్టుల నా పేరు లేదు. బ్యాంకుకు వెళ్లి అడిగితే సరైన సమాధానం లేదు. నాకు తెల్ల రేషన్ కార్డు ఉంది. ఐటీ లేదు. మరి ఎందుకు మాఫీ కాలేదో తెలుస్తలేదు. నాలెక్కన చాలా మంది రైతులకు మాఫీ కాలే.

**- కే సారయ్య గౌడ్, రంగంపల్లి (పెద్దపల్లి)**

### ఎందుకు కాలేదో తెలుస్తలేదు

మాకు మూడెకరాలు ఉన్నది. మా నాన్న నర్సయ్య మూడేళ్ల కింద కోపరేటివ్ బ్యాంకుల ₹94 వేల లోన్



తీసుకున్నడు. ఏడాది కింద చనిపోయిండు. సర్కారు రుణమాఫీ చేస్తనని చెబితే మా నాన్న తీసుకున్న లోన్ కూడా మాఫీ అయితదని అనుకున్న. కానీ, లక్షలోపు లిస్టుల పేరు రాలే. బ్యాంకోళ్లను అడిగితే.. లోన్ మిత్తి తోటి కలిపితే లక్ష కంటే ఎక్కువైనయ్ అన్నరు. సెకండ్ లిస్టుల వస్తది అన్నరు. కానీ, ₹1.50లక్షలలోపు లిస్టుల కూడా రాలే. సచ్చిపోయినోళ్లకు మా దగ్గర ఇద్దరు ముగ్గురికి మాఫీ అయినయ్. మా నాన్నది ఎందుకు కాలేదో తెలుస్తలేదు. **- మానుక లక్ష్మణ్, రైతు (ఎల్లారెడ్డిపేట)**

# ఉప్పొంగిన గోదావరి



*ధర్మారం: నందిమేడారంలోని నందిపంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ నుంచి ఉప్పొంగుతున్న జలాలు*

ధర్మారం/రామడుగు/బోయినపల్లి, జూలై 31: గోదారి గలగలా తరలివస్తున్నది. కాళేశ్వరం లింక్-2లో ఎత్తిపోతలతో దిగువన ఎల్లంపల్లి నుంచి ఎగువన మధ్యమానేరు జలాశయానికి పరుగులు తీస్తున్నది. ధర్మారం మండలం నంది మేడారంలోని నంది పంప్ హౌస్‌లో నాలుగు మోటర్లు (2,3,5,7) నడుస్తున్నాయి. ఒక్కో మోటర్ ద్వారా 3,150 చొప్పున 12,600 క్యూసెక్కులు డెలివరీ సిస్టర్న్‌ల ద్వారా ఎగిసి పడి నంది రిజర్వాయర్‌లోకి చేరుతున్నాయి. అక్కడ రిజర్వాయర్ గేట్లను ఎత్తడంతో అంతే మొత్తంలో జలాలు అండర్ టన్నెళ్లలో గ్రావిటీ ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలిపోతున్నాయి. అక్కడి నుంచి సైతం నాలుగు మోటర్లు (1,3,4,5 ) ద్వారా 12,600 క్యూసెక్కులు లిఫ్ట్ చేస్తుండగా, డెలివరీ సిస్టర్న్‌ల ద్వారా ఎగిసి పడ్డ జలాలు సుమారు 5.7 కిలోమీటర్లు ఉన్న గ్రావిటీ కాలువ ద్వారా ప్రవహించి వరదకాలువలో 99వ కిలోమీటర్ మైలురాయి వద్ద కలుస్తున్నాయి. అక్కడి నుంచి మధ్యమానేరుకు పరుగెడుతున్నాయి. బుధవారం ఉదయం వరకు 5.4 టీఎంసీల గోదారి జలాలను మధ్యమానేరుకు తరలించినట్టు గాయత్రీ పంప్‌హౌస్ డీఈఈ రాంప్రదీప్ తెలిపారు. కాగా, ఎత్తిపోతల ద్వారా పెద్ద ఎత్తున వరద వచ్చి చేరుతున్న నేపథ్యంలో మధ్యమానేరులో నీటి మట్టం గంట గంటకు పెరుగుతున్నది. పూర్తి నీటి సామర్థ్యం 27.054 టీఎంసీలుకాగా, ప్రస్తుతం 10.22 టీఎంసీలు ఉంది.

# కోళ్ల దొంగలు దొరికిన్రు

- ముగ్గురు అంతర్రాష్ట్ర చోరుల అరెస్ట్
- 22 నాటుకోళ్లు స్వాధీనం



*నిందితుల అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ కృష్ణ*

సుల్తానాబాద్, జూలై 31: ఆ ముగ్గురు యువకులు జల్సాలకు అలవాటు పడ్డారు. ఈజీ మనీ కోసం రాంగ్ రూట్ ఎంచుకున్నారు. పందెం కోళ్లు, కోళ్లను ఎత్తుకెళ్లి అడ్డంగా దొరికిపోయారు. ఆ ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను సుల్తానాబాద్ పోలీసులు బుధవారం ఉదయం అరెస్ట్ చేశారు. ఈ మేరకు సుల్తానాబాద్ ఠాణా ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి ఏసీపీ జీ కృష్ణ వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ కృష్ణా జిల్లాకు చెందిన మేచర్ల ఏసుబాబు (33), గ్యార విష్ణు (26), మేచర్ల కిషోర్ (38) ఈజీ మనీ కోసం అడ్డదారులు తొక్కారు. ఆంధ్ర, తెలంగాణలో పందెం కోళ్లను దొంగిలిస్తూ , వాటిని అమ్మగా వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసుకునే వారు. ఈ క్రమంలో వీరిపై పోలీసులు ఏడు చోరీ కేసులు నమోదు చేశారు. జూలై 26న సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన చీటి సతీశ్‌రావుకు చెందిన 22 నాటు కోళ్లను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ నరేష్‌కుమార్ బృందం పోలీసులు రంగంలోకి దిగారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించారు. దొంగలించిన కోళ్లను విక్రయించేందుకు బుధవారం ఉదయం స్విఫ్ట్ కారులో నిందితులు వెళ్తుండగా, సుల్తానాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 22 పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకునేందుకు కృషిచేసిన ఎస్‌ఐ నరేశ్, ఏఎస్‌ఐ తిరుపతి, హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, తిరుపతినాయక్, రమేశ్, రాజ్‌కుమార్‌ను అభినందిస్తూ, రివార్డులను అందజేశారు.




*కరీంనగర్‌లోని డీడీ కార్యాలయం ఎదుట నినదిస్తున్న విద్యార్థులు*

# హాస్టళ్లకు శాశ్వత భవనాలు నిర్మించండి

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల డిమాండ్

కరీంనగర్ కలెక్టరేట్/కమాన్‌చౌరస్తా జూలై 31: సంక్షేమ హాస్టళ్లకు శాశ్వత భవనాలు నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కరీంనగర్ సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ మాట్లాడుతూ జిల్లాలోని పలు వసతి గృహాలు, అద్దె భవనాలు, అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయని చెప్పారు. వానకాలంలో అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా నగరంలోని సుభాష్‌నగర్ బాలికలు, కశ్మీర్‌గడ్డ బాలుర హాస్టళ్లలోని సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. భద్రతా చర్యలు చేపట్టకపోవడంతో రాత్రివేళల్లో బాలికలు భయాందోళనలకు గురవుతున్నారని ఆరోపించారు. వసతుల కల్పనకు నిధులు ఇవ్వాలని, మూడు కొత్త హాస్టళ్లను ప్రారంభించాలని, పెరిగిన ధరలకనుగుణంగా మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలంటూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రతినిధులు గజ్జెల శ్రీకాంత్, శ్రీజ, సుధీర్, సతీశ్, రత్నం సురేశ్, గట్టు ఆకాశ్, త్రిష, అక్షయ్, సుస్మిత పాల్గొన్నారు.

# అంధకారంలో ‘ఖని’ దవాఖాన

- రాత్రి 2 గంటల నుంచి చీకట్లు
- ఇబ్బందులు పడ్డ రోగులు
- కేబుల్ వైర్ తెగిపోవడమే కారణం
- సాయంత్రం 4 గంటలకు పునరుద్ధరణ



*గోదావరిఖని ప్రభుత్వ దవాఖానలో కరెంట్ లేకపోవడంతో రోగుల ఇబ్బందులు*

ఫర్టిలైజర్‌సిటీ, జూలై 31: గోదావరిఖని ప్రభుత్వ మెడికల్ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న 85 పడకల ప్రభుత్వ దవాఖానలో అంధకారం అలుముకున్నది. బుధవారం తెల్లవారుజామున 2గంటల నుంచి సాయం త్రం 4 గంటల వరకు కారు చీకట్లో మగ్గింది. ఐసీయూ, సాధారణ ఓపీ, ఎమర్జెన్సీ మెడికల్ విభాగం, జనరల్ ఐపీ గదులకు విద్యుత్ సరఫరా లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డయాలసిస్ పెషెంట్లకు డయలాసిస్ జరుగలేదు. పవర్ కట్‌తో వాష్‌రూంలో నీటి వసతి లేక జనరల్ ఐపీ విభాగంలో జ్వరం, ఇతర సాధారణ సమస్యలతో వచ్చిన రోగులు, వారి బంధువులు దవాఖాన బయటకు వచ్చే పరిస్థితి ఏర్పడింది. బుధవారం ఉదయం దాదాపు 535 మంది దవాఖానకు రాగా, అందులో 36మంది ఇన్‌పెషేంట్లుగా చేరారు. అయితే దవాఖానకు కరెంట్ కోసం భూమి లోపల నుంచి వేసిన విద్యుత్ కేబుల్ భారీ వాహనాల రాకపోకలతో షాట్ సర్క్యూట్ జరిగి తెగిపోవడం వల్లే సరఫరా నిలిచిపోయినట్లు సిబ్బంది గుర్తించారు. సాయంత్రం 4 గంటలకు సరఫరాను పునరుద్ధరించారు. మెయిన్ కేబుల్‌వైర్ తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, యుద్ధ ప్రతిపాదికన మరమ్మతులు చేసి కరెంటును పునరుద్ధరించామని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ చెప్పారు.

### రాత్రి జాగారం చేసిన

రక్తకణాల సంఖ్య తగ్గడంతో రెండ్రోజుల కింద దవాఖానకు వచ్చిన. రాత్రి నుంచి కరెంటు లేకపోవడంతో జాగారం చేయాల్సి వచ్చింది. తనతో పాటు మా కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడ్డరు.



**- దాంపెల్లి భాగ్య, జూలపల్లి**

# ఏసీబీ కేసులో రిటైర్డ్ సీఐకి ఐదేళ్ల జైలు

కోర్టుచౌరస్తా, జూలై 31: అవినీతి నిరోధక శాఖ నమోదు చేసిన కేసులో ఓ రిటైర్డ్ సీఐకి ఐదేండ్ల జైలు శిక్ష పడ్డది. ఈ శిక్షతోపాటు ₹20 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా ఏసీబీ కోర్టు జడ్జి కుమార్ వివేక్ ఈ తీర్పును బుధవారం వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో ఉప్పుల కృష్ణపై 2013లో కేసు నమోదైంది. రిమాండ్ చేసేందుకు నిందితుడి తల్లి శశికళ వద్ద అప్పటి సీఐ చింతపట్ల లచ్చన్న ₹10 వేలు డిమాండ్ చేశాడు. దీంతో శశికళ ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. వారి సూచన మేరకు శశికళ లంచం డబ్బులను సీఐకి అందజేస్తుండగా, ఏసీబీ అధికారులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏసీబీ అధికారులు సాక్షులను కోర్టులో హాజరుపరచగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిశోర్ విచారించారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి.. నిందితుడు లచ్చన్నకు ఐదేళ్ల జైలుతోపాటు ₹20 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

# దేవాదాయ శాఖలో బదిలీలు



- కరీంనగర్ ఏసీ చంద్రశేఖర్ మెదక్ జిల్లాకు
- కొండగట్టు ఆలయ ఈవోగా రామకృష్ణారావు
- వేములవాడ ఇన్‌చార్జి ఈవోకే పూర్తిస్థాయి బాధ్యతలు

కమాన్‌చౌరస్తా/ వేములవాడ, జూలై 31: దేవాదాయ, ధర్మాధాయ శాఖలో బదిలీలు చేస్తూ రాష్ట్ర దేవాదాయ కమిషనర్ కార్యాలయం నుంచి బుధవారం రాత్రి ఉత్వర్వులు ఇచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అసిస్టెంట్ కమిషనరేట్ పరిధిలో అసిస్టెంట్ కమిషనర్‌తోపాటు జగిత్యాల జిల్లా కొండగట్టు ఆలయానికి డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారిని నియమించారు. అలాగే జిల్లాలోని పలు ఆలయాల ఈవోలను సైతం బదిలీ చేశారు. కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్, కొండగట్టు ఇన్‌చార్జి ఈవోగా ఉన్న ఆకునూరి చంద్రశేఖర్‌ను మెదక్ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. అలాగే హైదరాబాద్ ఎండోమెంట్ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ కమిషనర్ ఎం రామకృష్ణారావును కొండగట్టు ఆలయ ఈవోగా నియమించారు. గ్రేడ్-1 ఈవోగా ఉండి ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న కే సుధాకర్‌ను కరీంనగర్‌లోని మార్కెట్ రోడ్డు వేంకటేశ్వర స్వామి ఆలయానికి బదిలీ చేశారు. కరీంనగర్‌లోని హనుమాన్ సంతోషి మాత ఆలయ ఈవోగా ఉన్న నాగుల అనిల్ కుమార్‌ను తిమ్మాపూర్ మండలం నల్లగొండ సీతారామ లక్ష్మి నరసింహాస్వామి ఆలయానికి బదిలీ చేశారు. కరీంనగర్‌లోని విజయగణపతి సాయిబాబా దేవాలయం ఈవో ఏ మారుతిని మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ఈవోగా నియమించారు. కరీంనగర్ మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి ఆలయంలో గ్రేడ్- 3 ఈవోగా ఉన్న నాగారపు శ్రీనివాస్‌ను గ్రేడ్-2 ఈవోగా పదోన్నతి కల్పిస్తూ కరీంనగర్ జ్యోతినగర్‌లోని హనుమాన్ సంతోషి మాత ఆలయానికి కేటాయించారు. అలాగే గ్రేడ్-3 ఈవోగా ఉన్న వామన్‌రావుకు పదోన్నతి కల్పిస్తూ జగిత్యాలోని దుబ్బ రాజరాజేశ్వర్ స్వామి ఆలయ ఈవోగా బదిలీ చేశారు. పెద్దపల్లిలోని లక్ష్మీనరసింహా స్వామి ఆలయంలో ఈవోగా ఉన్న ఎం శంకరయ్యను మంథనిలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయ ఈవోగా బదిలీ చేశారు. అలాగే వేములవాడ ఇన్‌చార్జి ఈవోగా ఉన్న డీసీ వినోద్ రెడ్డికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు.

### పాలనలో చంద్రశేఖర్ తనదైన ముద్ర

2020 జూలైలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆకునూరి చంద్రశేఖర్ ఉమ్మడి జిల్లాలో తనదైన ముద్ర వేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతరతో పాటు, ఇల్లందకుంట, మార్కెట్ రోడ్డు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అధికారుల సమన్వయంతో నిర్వహించారు. కొండగట్టు అంజన్న స్వామి ఆలయానికి ఇన్‌చార్జిగా ఉన్న క్రమంలో సైతం తనదైన మృదు స్వభావంతో పలు క్లిష్ట సమయాల్లో బాధ్యతలు నిర్వర్తించి గుర్తింపు తెచ్చుకున్నారు.